

రాయవరంలో హాల్ టిక్కెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలి రోజు ప్రశాంతం... 770 మంది గైర్హాజరు

అమలాపురం టౌన్, మార్చి 1: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు తొలి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో 14,490 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి సోమశేఖరరావు తెలిపారు. 13,720 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 770 మంది గైర్హాజరైనట్టు ఆయన తెలిపారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగలేదన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎవరికైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే 98497 20718 నెంబరుకు సమాచారం అందించాలని సోమశేఖరరావు కోరారు.



విద్యార్థులకు విద్యా దీవెన చెక్కు అందజేస్తున్న ఎంపీ అనురాధ, జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

జిల్లాలో 33,502 మంది విద్యార్థులకు

రూ.25.80 కోట్ల లబ్ధి

అమలాపురం టౌన్, మార్చి 1: గత ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు జిల్లాలో చదువుకున్న విద్యార్థులకు 'జగనన్న విద్యా దీవెన' పథకం సొమ్ములను ప్రభుత్వం విడుదల చేసిందని జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ తెలిపారు. జిల్లాలో 33,502 మంది విద్యార్థులకు రూ.25,80,31,958 లబ్ధిని తల్లులు, విద్యార్థులసం యుక్త ఖాతాలోకి సీఎం జగన్ బటన్ నొక్కి జమ చేశారన్నారు. ఆ మొత్తాన్ని పదిరోజుల్లోపు ఆయా కళాశాలలకు చెల్లించాలని జేసీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం విద్యాదీవెన మెగా చెక్కును ప్రజాప్రతినిధులతో కలిసి జేసీ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీలు పందిరి శ్రీహరి, గెడ్డం సంపదరావు, పి.రాజేశ్వరి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వై.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- తాజా సర్వేలతోనే అభ్యర్థుల ఎంపిక జరిగేనా?
- ఆశావహుల జాతకాలు తేల్చనున్న సర్వేలు
- టిక్కెట్ల వేటలో ఎవరికి వారే పైరవీలు
- జనసేనకు అమలాపురమా.. రామచంద్రపురమా
- వైసీపీలో గందరగోళానికి దారితీస్తున్న సీట్ల ప్రకటన
- ఇదీ కోనసీమ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులు



రసవత్తరం

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు టిక్కెట్ల వేటలో ఎవరి పైరవీలు వారు చేస్తున్నారు. ఆశావహులు సర్వే, జాతకాలపైనే దృష్టి పెడుతున్నారు. ప్రధానంగా ఆర్థిక బలం కలిగిన అభ్యర్థుల వైపు రాజకీయ పార్టీలు దృష్టి పెడుతుండడంతో అటు టీడీపీ, జనసేన, ఇటు వైసీపీ అభ్యర్థుల్లో అదృష్టం ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ ఆయా పార్టీల కేడర్లలో నెలకొంది. టీడీపీ, జనసేన అభ్యర్థుల తుది జాబితా మరి కొన్ని రోజుల్లో వెలువడనుండడంతో ఆ పార్టీల అభ్యర్థులు సీట్ల కోసం అన్ని రకాల ఒత్తిళ్లు చేపట్టారు. వైసీపీ సీట్లు ఇంకా ఖరారు కాకపోవడంతో ఆ పార్టీకి చెందిన ప్రస్తుత ప్రజాప్రతినిధులు, ఆశావహులు అయోమయానికి గురవుతున్నారు. కోనసీమ జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో రాజకీయ తాజా పరిస్థితులు ఇలా..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లాలో టీడీపీ-జనసేన ఇప్పటికే నాలుగు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. బండారు సత్యానందరావు (కొత్తపేట), దాట్ల బుచ్చిబాబు (ముమ్మిడివరం), సరిపెల్ల రాజేష్ (పి.గన్నవరం), వేగుళ్ల జోగేశ్వరరావు(మండపేట). మిగిలిన మూడు స్థానాలపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం జనసేనకు రెండు సీట్లు కేటాయిస్తారనే ప్రచారంతో అమలాపురం అసెంబ్లీ టిక్కెట్టు విషయంలో తీవ్ర సందిగ్ధత ఉంది. సిటింగ్ స్థానమైన రాజోలు నుంచి జనసేన అభ్యర్థి పోటీ చేస్తారని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించినప్పటికీ అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో అక్కడ టీడీపీ, జనసేన శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. మరో స్థానం విషయంలో అమలాపురం కేటాయిస్తారా లేక రామచంద్రపురం ఇస్తారా అనేదానిపై రెండు నియోజకవర్గాల్లోని ఇరు పార్టీల కేడర్లలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. ఎవరి వ్యూహాలతో వారు ముందుకు సాగిపోతున్నారు. దాంతో ఏ స్థానం నుంచి జనసేన పోటీ చేస్తుందనేది తేలడం లేదు. జిల్లా కేంద్రమైన అమలాపురాన్ని జనసేనకు కేటాయించాలని ఆ పార్టీ నేతలు పట్టుబడుతున్నప్పటికీ అంతకు రెట్టించిన రీతిలో టీడీపీ శ్రేణులు ఎట్టి పరిస్థితుల్లోనూ టీడీపీకే కేటాయించాలని భీష్మించారు. కాగా అమలాపురం సీటును జనసేనకు కేటాయించి అభ్యర్థిగా శెట్టిబత్తుల రాజబాబును ప్రకటించారంటూ మూడు రోజుల క్రితం ఆ పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి వేడుకలు జరుపుకున్న వ్యవహారం జనసేనలోని రెండు వర్గాల మధ్య వివాదానికి కారణమైంది. చివరకు రాజబాబు ఈ పరిణామాలపై ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే టీడీపీ కూడా అందుకు తగిన రీతిలో సమావేశాలు నిర్వహిస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తోంది. ఈ స్థానాన్ని ఎవరికి కేటాయిస్తారనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇక మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అమలాపురం స్థానంలో ఎవరిని విజయం వరిస్తుందోనన్న అంశంపై తాజాగా ఫ్లాష్ సర్వే నిర్వహించడానికి టీడీపీ, జనసేన రంగంలోకి దిగినట్టు తెలిసింది. దాంతో ఇరు పార్టీల నేతలు ప్రస్తుతం అలెర్ట్ అయ్యారు.

ఇక రామచంద్రపురం నియోజకవర్గంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వైసీపీ అభ్యర్థిగా రాజ్యసభ సభ్యుడు పిల్లి బోస్ తనయుడు సూర్యప్రకాష్‌ను ఎంపిక చేయడంతో అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని బరిలోకి దింపాలని టీడీపీ యోచిస్తున్నట్టు తెలిసింది. శెట్టిబలిజ యువతలో పట్టున్న నాయకుడిగా పేరున్న వాసంశెట్టి సుభాష్ పేరు పరిశీలనలోకి తీసుకుని ఐవీఆర్‌ఎస్ సర్వే కూడా టీడీపీ చేపట్టింది. అయితే ఈ నియోజకవర్గంలో ఆర్థిక, అంగబలం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందిన పప్పులమసేను వెంకన్న అలియాస్ రేవు శ్రీను ఇటీవలే చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. తనకు రామచంద్రపురం సీటు కేటాయించాలంటూ ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థిక బలం కలిగిన రేవు శ్రీనుకు ప్రత్యర్థులకు చుక్కలు చూపించే సామర్థ్యం ఉండడంతో పాటు వైసీపీలోని ఒక వర్గం, టీడీపీ-జనసేన కేడర్ కలిసి వస్తుందన్న విశ్లేషణతో పైరవీలు చేసుకుంటున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కొన్ని కీలక సామాజికవర్గ పెద్దలు ఇతని కోసం పట్టుబడుతున్నట్టు తెలిసింది.

జనసేనకు కేటాయించిన రాజోలు సీటుకు సమర్థుడైన అభ్యర్థి కోసం ఆ పార్టీ శ్రేణులు ఇంకా అన్వేషణలోనే ఉన్నట్టు సమాచారం.

పి.గన్నవరం టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన మహాసేన రాజేష్ గురువారం అయినవిల్లి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించినప్పటికీ టీడీపీ-జనసేన కేడర్ పూర్తిగా దూరంగా ఉండడంతో రాజకీయం రసవత్తరమైంది. తాజాగా నియోజకవర్గంలోని ఇరు పార్టీల కీలక వ్యక్తుల నుంచి రాజేష్ అభ్యర్థిత్వంపై కూలంకుషంగా ఫోన్ల ద్వారా సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది. అభ్యర్థి గుణగణాలు, ఆయా ప్రాంతాల్లోని ప్రజల మనోభావాలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం.

వైసీపీ సీట్ల ఎంపిక గందరగోళమేనా..!

అధికార వైసీపీలో అభ్యర్థుల ఎంపికలో గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయి. విప్పర్తి వేణుగోపాల్ (పి.గన్నవరం), పిల్లి సూర్యప్రకాష్ (రామచంద్రపురం)లను నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించడంతో వారిద్దరూ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. మిగిలిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడం ఆ పార్టీ ప్రస్తుత ప్రజాప్రతినిధులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధులే ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తారని ఇటీవల ఒక బహిరంగ సభలో సీఎం జగన్ చేసిన వ్యాఖ్యానాలపై క్లారిటీ లేకపోవడంతో వారిలో గందరగోళం కొనసాగుతోంది.

రాజోలు నియోజకవర్గానికి వచ్చేసరికి గురువారం వైసీపీలో చేరిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు శుక్రవారం నుంచి సఖినేటిపల్లి మండలంలో వైసీపీ నేతలను కలిసే పనిలో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం వైసీపీ రాపాక వరప్రసాదరావు వర్గీయులుగా పేరొందిన వారినే కలవడంతో రాజకీయం రాజుకుంటోంది. వైసీపీ అభ్యర్థిగా గొల్లపల్లిని ప్రకటిస్తే రాపాక పరిస్థితి ఏమిటనేది అక్కడి కేడర్‌ను అయోమయానికి గురి చేస్తోంది. ఎంపీ అభ్యర్థిగా ఐఆర్‌ఎస్ అధికారి ఒకరు వస్తారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ప్రస్తుత ఎంపీ చింతా అనురాధ భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకమైంది. అమలాపురం మంత్రి పినిపే విశ్వరూప్, ముమ్మిడివరం నుంచి ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సతీష్‌కుమార్, కొత్తపేట నుంచి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మండపేట నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్లు ఖరారయ్యే అవకాశాలు ఉన్నట్టు ఆ పార్టీ వర్గీయులు పేర్కొంటున్నారు. అయితే చివరి క్షణంలో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల ఉంచి చేర్పులు, మార్పులు ఉండవచ్చన్న సంకేతాలతో వైసీపీ నేతల్లో కూడా గందరగోళ పరిస్థితులున్నాయి.



ఈఎండీపీ ఎక్స్‌పోలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

'విద్యార్థి దశ నుంచే ఉత్పాదక రంగాల వైపు

ఆలోచించాలి'

కొత్తపేట, మార్చి 1: విద్యార్థి దశ నుంచే నుంచి ఉత్పాదక రంగాలవైపు ఆలోచనలు సాగాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎం.కమలకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి (ఈఎండీపీ) వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై ఎక్స్‌పో నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని 224 ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న 13వేల మంది విద్యార్థులకు ఈ ప్రోగ్రాం అమలవుతుందన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రోగ్రాం ఉద్దేశ్యమన్నారు. దీనికి సంబంధించి జిల్లాలో పది ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించగా అందులో రెండు ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామన్నారు. వాటి ప్రదర్శన ఈ నెల 6న ఉంటుందన్నారు. సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు, జోనల్ మేనేజరు యనమదల నవ్య, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, బి.హనుమంతరావు, కేవీ సూర్యనారాయణ, బి.రమేష్‌బాబు, ఎంఏకే భీమారావు, గోపాలరాజ్, ఎం.హరిప్రసాద్, క్రిస్టఫర్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రతిపక్ష పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలి

అమలాపురం రూరల్, మార్చి 1: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండు చేస్తూ ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించే మహాగర్జన సభను విజయవంతం చేయాలని జేఏసీ అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం అమలాపురంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో సమగ్ర శిక్షా జేఏసీ సమావేశం నిర్వహించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్న ప్రధాన డిమాండ్లతో మహా గర్జన సభ నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి వి.వెంకటరమణ, ఎస్కే రెహ్మాన్, ఎం.అనూష, ఆర్.రమాదేవి, జి.సునీత, ఎన్.గంగాధరరావు, ఎన్వీపీ కుమారి, జి.నాగన్న, బి.వరలక్ష్మి, ఎంకే అన్నపూర్ణ, జె.గోపాలరావు, డి.నాగమల్లేశ్వరరావు, ఎన్.త్రినాథ్, వి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలిని పరిశీలిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

హసన్‌బాదలో 9న ప్రజాగళం

బహిరంగ సభ

టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రాక

ద్రాక్షారామ, మార్చి 1: రామచంద్రపురం మండలం హసన్‌బాదలో ఈ నెల 9న ప్రజాగళం బహిరంగ సభ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఒక ప్రైవేటు లే-అవుట్ స్థలాన్ని టీడీపీ రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ రెడ్డి సుబ్రహ్మణ్యం శుక్రవారం ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రామచంద్రపురం, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాలు ప్రజలు సభకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మండల శాఖ అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, వల్లూరి సురేష్, మర్రివాడ సూరిబాబు, కొసనా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పసలపూడి పంచాయతీ వద్ద విచారణ నిర్వహిస్తున్న పీడీ మధుసూదనరావు

పసలపూడి పంచాయతీలో అవినీతిపై

డ్వామా పీడీ విచారణ

రాయవరం, మార్చి 1: మండలంలోని పసలపూడి పంచాయతీలో అవినీతి చోటుచేసుకుందని 2022 అక్టోబరులో కాకినాడ కలెక్టరేట్ 'స్పందన'లో ఆ గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి చేసిన ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై కలెక్టర్ ఆదేశాలతో డ్వామా పీడీ మధుసూదన్‌ను విచారణ అధికారిగా నియమించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన పసలపూడి పంచాయతీ కార్యాలయానికి విచ్చేసి విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు చింతా తమ్మిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పసలపూడి పంచాయతీలో అప్పటి కార్యదర్శితో పాటు పాలకవర్గ సభ్యులు అవకతవకలకు పాల్పడ్డారని, నిబంధనలు ఉల్లంఘించారని స్పందనలో ఫిర్యాదు చేశారన్నారు. పంచాయతీ సొమ్మును అనధికారికంగా ఇతరుల ఖాతాకు మళ్లించారని, 2020-21 సంవత్సరంలో లే-అవుట్లలో అనధికారికంగా తీర్మానం చేసి అనుమతులు ఇచ్చారని, జీపీడీపీ ప్లాన్‌కు సంబంధించి పన్నులు, ప్రణాళికలు నమోదు చేయకుండా 11వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించారని, గ్రామంలో సీసీ రోడ్లు వేయాలనే నిబంధనలున్నా కొన్ని రోడ్లను పొలాల్లో వేశారని, అనధికారిక లే-అవుట్లకు అనుమతి ఇచ్చారన్నారు. పంచాయతీ కామన్ స్థలాలు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయని, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం సిబ్బంది జీతాల్లో నిధుల దుర్వినియోగం జరిగిందని.. తదితర 11 అంశాలపై తమ్మిరెడ్డి చేసిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాలతో తాను విచారణకు వచ్చినట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఒక కమిటీని నియమించి సమగ్ర విచారణ జరిపించడంతో పాటు ఉమ్మడి జిల్లా కేంద్రమైన కాకినాడలో ఉన్న కొన్ని రికార్డులను తెప్పించి వాటిని పరిశీలించిన అనంతరం విచారణ అంశాలను కలెక్టర్‌కు నివేదిస్తానని తెలిపారు. పీడీ వెంట ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఉన్నారు.

ఫిర్యాదుదారుడు తమ్మిరెడ్డి మాట్లాడుతూ 2019-2020, 2020-21ల్లో సుమారు రూ.20లక్షలు, 2021-22, 2022-23ల్లో సుమారు రూ.31లక్షలు దుర్వినియోగమయ్యాయని, ఆర్థిక సంఘం నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారని ఆరోపించారు. పంచాయతీ పరిధిలో కామన్ స్థలాలు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్నాయని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సిబ్బందికి ఇచ్చిన జీతాల్లో సుమారు రూ.2 లక్షలు దుర్వినియోగం జరిగిందన్నారు. వీటన్నిటిపైనా సమగ్ర విచారణ జరిపి రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తమ్మిరెడ్డి కోరారు.



నగరంలో బీటలు తీసిన వరి చేలో నిరసన తెలుపుతున్న రైతులు

సాగు నీరందించండి మహాప్రభో

మామిడికుదురులో రోడ్డెక్కిన రైతులు

మామిడికుదురు, మార్చి 1: సాగునీరు అందించాలంటూరైతులు రోడ్డెక్కారు. పంట పొలాలు బీటలు తీసి ఎందుకూ పనికి రాకుండా పోయాయని ఆందోళన వ్యక్తం చేస్తూ రైతులు, కౌలు రైతులు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట 216 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. సాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండు చేశారు. ఖరీఫ్ పంట చిరుపొట్ట దశలో ఉందని, మండలంలోని పలు గ్రామాలకు సరిపడా నీరు అందక పొలాలు నెర్రలు తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన వంతుల వారీ విధానంలో సక్రమంగా నీరు అందట్లేదన్నారు. ఎంతో కష్టపడి దాళ్వా పంటపండిస్తే సాగు నీరందక అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ మేరికమ్మకు అందించారు.

కౌలు రైతు సంఘం నాయకుడు పీతల రామచంద్రరావు, గాలిదేవర రాంబాబు, తాటికాయల ఉదయభాస్కరరావు, గంధం విజయభాస్కరరావు, కోలా శ్రీనివాస్, కడలి బాబూరావు, కట్టా వెంకటేశ్వరరావు, పితాని ప్రసాదరావు, అప్పారి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు తహసీల్దార్ కార్యాలయం ఎదుట 216 జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



కలెక్టరేట్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ నుపూర్‌అజయ్

పరిశ్రమల డేటాబేస్‌ను అభివృద్ధి చేశాం

జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నిసూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల డేటా బేస్‌ను అభివృద్ధి చేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం 'పనితీరును మెరుగుపరిచి వేగవంతం చేయడం' అనే స్కీమును ప్రకటించిందని తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సర్వేకు సంబంధించి కరపత్రాలను, పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ1 అనే ఏకీకృత పోర్టల్‌ను ప్రారంభించారన్నారు. ఎంఎస్ఎంపీ సర్వే అండ్ సపోర్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లోని ఎమినిటీస్ సెక్రటరీలు ఈ నెల 20వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారు. బ్యాంకు రుణ సదుపాయాలు సులభతరంగా పొందే వెసులుబాటుతో పాటు వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హులు అవుతారని జేసీ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పీకేసీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చర్చ..రచ్చ



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వాహనాన్ని చుట్టుముట్టిన పోలీసులు



ఇంటికి వచ్చిన పోలీసులను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తిలో 'బహిరంగ చర్చ' రచ్చరచ్చ

మాజీ ఎమ్మెల్యే చర్చ పిలుపునకు స్పందించని ఎమ్మెల్యే

బయటకు వెళ్లకుండా నల్లమిల్లిని అడ్డుకున్న పోలీసులు

పోలీసులకు టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట

అనపర్తి, మార్చి 1: అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఐదేళ్లలో చేసిన రూ.500 కోట్ల అవినీతిపై చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ప్రకటన, తదనంతర పరిణామాలు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ బహిరంగ చర్చ అంశం రచ్చరచ్చగా మారింది. ఇది శుక్రవారం అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వర్గీయులు, రామవరంలో రామకృష్ణారెడ్డి వర్గీయుల బలప్రదర్శనగా సాగింది. ఇటీవల నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అవినీతిపై ముద్రించిన కరపత్రం సూర్యనారాయణకు చెందిన గంగిరెడ్డి నర్సింగ్ హోంలోని సిబ్బందికి స్వయంగా అందజేశారు. ఇది వివాదాస్పదంగా మారింది. తాను లేనపుడు ఆసుపత్రికి రావడం కాదని.. దమ్ముంటే ముందుగా సమయం చెప్పి రావాలంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలతో వివాదం మరింత పెరిగింది. దీనికి స్పందించిన నల్లమిల్లి మార్చి 1వ తేదీ ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే ఇంటికి అవినీతిపై చర్చించేందుకు వస్తానని ప్రకటించారు. దీంతో బహిరంగ చర్చ అంశం తెరమీదకు వచ్చింది. నల్లమిల్లి చేసిన ప్రకటనకు నాలుగు రోజులు గడిచినా ఎమ్మెల్యే నుంచి ఎటువంటి స్పందన లేదు. అయినప్పటికీ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బహిరంగ చర్చకు వచ్చేందుకు సిద్ధపడడంతో గురువారం రాత్రి నుంచే పోలీసు బలగాలు నల్లమిల్లి ఇంటికి చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం అనపర్తిలో ఎమ్మెల్యే నివాసానికి వైసీపీ శ్రేణులు, రామవరంలో నల్లమిల్లి నివాసానికి టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకున్నాయి. 10:30 ప్రాంతంలో అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తన అనుచరులతో ర్యాలీ నిర్వహిస్తున్నారని తెలుసుకున్న రామకృష్ణారెడ్డి అనపర్తి వెళ్లేందుకు పయనం కావడంతో పోలీసులు ఇంటిలోకి చొరబడి ఆయనను గృహ నిర్బంధం చేసేందుకు ప్రయత్నించారు. చివరకు పోలీసులను దాటుకుని అనపర్తి-పెడపర్తి రోడ్డుపైకి చేరుకున్న నల్లమిల్లిని పోలీసులు అడ్డుకున్నారు. వాహనంపై వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అక్కడి నుంచి కదలనివ్వకపోవడంతో ఆయన వాహనం దిగి రోడ్డుపై భైఠాయించి సుమారు గంటన్నర పాటు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు వాహనం ఎక్కించుకుని అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. కొందరు నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై పడుకుని నిరసన తెలపడంతో పోలీసులు వారిని వాహనానికి అడ్డు తొలగించి నల్లమిల్లిని అక్కడి నుంచి తరలించారు. నల్లమిల్లిని తరలిస్తున్న పోలీసు వాహనాన్ని టీడీపీ నాయకులకు చెందిన కార్లు, బైకులు వెంబడించాయి. రామవరం నుంచి కొవ్వూరు తరలించడం ఆఖరికి ఏ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లకుండా రోడ్లపైనే తిప్పడంతో కొవ్వూరు టోల్‌ప్లాజా వద్ద టీడీపీ నాయకులు పోలీసు వాహనాన్ని అడ్డుకుని ఆందోళన చేయడంతో మూడున్నర గంటల హైడ్రామా తర్వాత నల్లమిల్లిని అదే వాహనంలో ఇంటికి తీసుకొచ్చి వదిలిపెట్టారు. ఇంటికి చేరుకున్న నల్లమిల్లికి ఆయన సతీమణి మహాలక్ష్మి హారతిచ్చారు.

బహిరంగ చర్చ చేసే ధైర్యం లేకే..

అవినీతిపై తన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని పలాయనం చిత్తగించారని రామకృష్ణారెడ్డి విమర్శించారు. పదేళ్లుగా తనపై అవే ఆరోపణలు చేస్తున్నారని, సదరు ఆరోపణలపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించారని, నేటికీ నివేదిక బయటకు ఎందుకు రాలేదన్నారు. అవినీతి జరిగి ఉంటే అధికారంలో ఉండి కూడా తనను ఎందుకు వదలిపెట్టారని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేసిన అవినీతిని ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధమని చెప్పినా ఆయన చర్చకు ఎందుకు రావడంలేదో ప్రజలకు అర్థమయిందన్నారు. రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేల్లో అవినీతికి పాల్పడని ఎమ్మెల్యే తానేనని చెప్పుకునే సూర్యనారాయణరెడ్డికి నీతిపరుడని నిరూపించుకునే చర్చలో పాల్గొనడానికి భయమెందుకని ఎద్దేవా చేశారు.



నల్లమిల్లి అనుచరుల నిరసన

వైసీపీ నాయకుల ర్యాలీ

ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వైసీపీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక గంగి రెడ్డి నర్సింగ్ హోమ్ నుంచి దేవీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అవినీతిపై ముందు చర్చ జరగాలని డిమాండ్ చేశారు. తాను అవినీతికి పాల్పడినట్టు రుజువు చేయ గలిగితే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు.

కొవ్వూరులో ఉద్రిక్తత

కొవ్వూరుకు రామకృష్ణారెడ్డి.. తెలుగు తమ్ముళ్ల ఆందోళన

గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద పోలీసు వాహనాన్ని అడ్డుకున్న నాయకులు

ఎందుకు తిప్పుతున్నారని డీఎస్పీని నిలదీసిన నేతలు

కొవ్వూరు, మార్చి 1 : అనపర్తి సంఘటన కొవ్వూరును కూడా తాకింది. అవినీతిపై గళమెత్తిన టీడీపీ నాయకులను అక్రమ అరెస్టులు చేసి రోడ్లపై కారులో తిప్పడం ఈ అరాచక ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ఎన్నికల వేళ తాజాగా అనపర్తి మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఉదయం అనపర్తిలో అదుపులోకి తీసుకుని సుమారు రెండు గంటలపాటు కారులో తిప్పుతూ చివరకు కొవ్వూరుకు తీసుకువచ్చారు. కొవ్వూరులో ఏ పోలీస్‌స్టేషన్‌లో ఉంచుతారోనని పోలీసులు, నాయకులు అంతా అప్రమత్తమయ్యారు. అయితే మధ్యలో ఏం జరిగిందో ఏమోగాని పోలీసులు రాజమహేంద్రవరం గామన్‌బ్రిడ్జిపై నుంచి కొవ్వూరు మీదుగా పంగిడి వైపు వెళ్లిపోయారు. కొంతదూరం వెళ్లిన తరువాత అక్కడ నుంచి వెనుదిరిగి వస్తుండగా గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరిల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. తమ నాయకుడిని ఎందుకు అరెస్టుచేశారు, ఎక్కడికి తీసుకువెళ్తున్నారు, కారులో ఎందుకు తిప్పుతున్నారని డీఎస్పీని ప్రశ్నించారు. దీనికి డీఎస్పీ కేసు ఏం లేదని, ఇంటికి తీసుకువెళ్లి దింపుతామని చెప్పడంతో అయితే తన వాహనంలో తీసుకువెళ్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ పట్టుపట్టారు. రామకృష్ణారెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నందున తామే ఇంటివద్ద అప్పజెబుతామని డీఎస్పీ చెప్పారు. అయినా జవహర్ వినకుండా రామకృష్ణారెడ్డిని తరలిస్తున్న పోలీసు వాహనంలో ఎక్కి తానూ వస్తానంటూ పట్టుబట్టారు. ఈ సందర్భంగా కొవ్వూరు టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి మాట్లాడుతూ అనపర్తి ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే రూ.500 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, దానిని నిరూపిస్తానని బయలుదేరిన రామకృష్ణారెడ్డిని ఏం జరిగిందని ఆలోచన చేయకుండా, మాజీ ఎమ్మెల్యే అని చూడకుండా అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం అదే వాహనంలో రామకృష్ణారెడ్డిని అనపర్తి తరలించారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాస్, కాగిత రఘు, బూరుగుపల్లి వీర రాఘవులు, కొత్తపల్లి ఆశిష్‌లాల్, జి.జి. చలం, వేమగిరి వెంకట్రావు, యనమదల శివరామకృష్ణ, కాకర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



కొవ్వూరు గామన్‌బ్రిడ్జి వద్ద పోలీసులను ప్రశ్నిస్తున్న నేతలు

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఇద్దరికి కాంస్య పతకాలు

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 1: తమ విద్యార్థినులు అఖిల భారత, ఖేలో ఇండియా విశ్వవిద్యాలయ క్రీడల్లో ప్రతిభ కనబరిచి రెండు కాంస్య పతకాలను సాధించారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ నన్నయ యూనివర్సిటీ అనుబంధ కళాశాలైన డీఆర్‌కే రెడ్డి వ్యాయామ విద్య కళాశాల (గొల్లలమామిడాడ)లో డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బైరెడ్డి రాజేశ్వరి అఖిల భారత వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 45 కిలోల కేటగిరిలోనూ, ఖేలో ఇండియా పోటీల్లో 49 కిలోల కేటగిరిలో బైరెడ్డి చంద్రిక కాంస్య పతకాలను సాధించారన్నారు. వీరిద్దరూ భవిష్యత్‌లో మరిన్ని పతకాలు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, క్రీడా బోర్డు కార్యదర్శి బి.రామ్‌గోపాల్, పీడీ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

షార్ కాంట్రాక్టర్ ఆత్మహత్య



సూళ్లూరుపేట, మార్చి 1: సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న షార్ కాంట్రాక్టర్ వి.నాగేశ్వరరావు (55) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల సమచారం మేరకు... రాజమహేంద్రవరానికి చెందిన నాగేశ్వరరావు గత 20 సంవత్సరాల పైబడి షార్‌లో అనసూయ ఇంజినీరింగ్ వర్క్స్ పేరుతో స్ట్రక్చరల్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నారు. బాలాజీ నగర్‌లోని సొంత ఇంట్లో తన వద్ద పనిచేస్తున్న వర్కర్స్ ఉంటుండగా ఆయన బాపూజీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఇటీవలే ఇంటిని కూడా అమ్మేసినట్లు తెలిసింది. శుక్రవారం అమ్మిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన బాలాజీ నగర్‌లో ఉన్న తన సొంత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సిబ్బంది నాగేశ్వరరావు ఉరేసుకొని మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆయన భార్యకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి భార్యను వివరాలడిగి తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

3 జిల్లాల్లో 2,550 మంది గైర్హాజరు

పలు చోట్ల అసౌకర్యాలతో విద్యార్థుల ఇక్కట్లు



రాజమహేంద్రవరం: పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున మొదటి ఏడాది తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్ష కావడంతో విద్యార్థులు కాస్త టెన్షన్ ఫ్రీగా కనిపించారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా.. గంట ముందుగానే చాలా మంది విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులను పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత గదుల్లోకి అనుమతించారు. తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో జనరల్ విభాగంలో 52,277 మంది విద్యార్థులకు 50,411 మంది.. ఒకేషనల్‌లో 6,889కి 6,205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మూడు జిల్లాల్లో కలిపి మొత్తం 2,550 మంది గైర్హాజరయ్యారు. గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సమయానికి బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలను ఆశ్రయించి పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఉరుకులు పరుగులు తప్పలేదు. ప్రైవేటు కళాశాలలు విద్యార్థులు కళాశాలకు వస్తే అక్కడి నుంచి పరీక్ష కేంద్రానికి.. పరీక్ష ముగిసిన తర్వాత కళాశాలకు బస్సు సదుపాయం కల్పించకపోవడంతో విద్యార్థులకు ఇళ్లకు వెళ్లడానికి అవస్థలు తప్పలేదు. కొన్ని పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో సీలింగ్ ఫ్యాన్లు పని చేయకపోవడంతో మూడు గంటల పాటు పరీక్ష రాసే క్రమంలో విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. అయితే, కిటికీలు తెరుచుకోవాలని అభ్యర్థులకు సిబ్బంది సలహా ఇచ్చారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకొచ్చిన తల్లిదండ్రులు చాలా మంది వేచి చూడడానికి నీడ దొరక్క ఇబ్బంది పడ్డారు. మూడు గంటల పాటు వేచి ఉండే క్రమంలో ఎండ వేడిమికి ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారు. తాగునీరు, మరుగుదొడ్లు సమస్యగా మారాయి. తూర్పుగోదావరి జిల్లాలో జనరల్ విభాగంలో 19,737 మందికి 19,309.. ఒకేషనల్ విభాగంలో 2,001కి 1,851 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో జనరల్ 21,045 మందికి 20,389.. ఒకేషనల్ 1,893కి 1,775.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జనరల్ విభాగంలో 11,495 మంది విద్యార్థులకు 10,713.. ఒకేషనల్ విభాగంలో 2,995కి 2,579 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు పేర్కొన్నారు. కాగా.. శనివారం(2వ తేదీన) రెండో ఏడాది జనరల్ విద్యార్థులకు ద్వితీయ భాష, ఒకేషనల్‌కి జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్షలు జరుగుతాయి.



రాజమహేంద్రవరంలో ఓ పరీక్ష కేంద్రం వద్ద సందడి..

పంచాయతీల అభివృద్ధికి నిధులివ్వాలి

కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల ధర్నా

సర్పంచ్‌లు, పోలీసుల మధ్య తోపులాట.. ఉద్రిక్తత..



సర్పంచ్‌లను నిలువరిస్తున్న పోలీసులు

కాకినాడ సిటీ, మార్చి 1: తమ న్యాయమైన 16 డిమాండ్లను పరిష్కరించాలని, పంచాయతీల అభివృద్ధికి నిధులు, అధికారాలను తక్షణమే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అండ్ సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సర్పంచ్‌లు చేపట్టిన ధర్నా ఉద్రిక్తతకు దారితీసింది. సర్పంచ్‌లను కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకుని లోపలికి వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సర్పంచ్‌లకు పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అప్పటికే జనసేన-టీడీపీకి చెందిన నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. సర్పంచ్‌లను లోపలికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరును, ప్రభుత్వతీరును నిరసిస్తూ సర్పంచ్‌లు నినాదాలతో హోరెత్తించారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రోడ్లు, కాలువలు, తాగునీరు, వీధి దీపాలు వంటివి ప్రజలకు సమకూర్చలేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు ఇవ్వాల్సిన వాటా నిధులు ఇవ్వకపోగా ఇతర ఆదాయం ద్వారా వచ్చే నిధులను, కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పంపిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వేల కోట్ల రూపాయలను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, సచివాలయ గృహ సారథులు, కన్వీనర్లను ప్రవేశపెట్టి పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల హక్కులు, అధికారాలను హరించివేశారన్నారు. అనంతరం కలెక్టర్‌కు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల నిరసన ధర్నాకు జనసేన పీఏసీ సభ్యులు పంతం నానాజీ సంఘీభావం తెలిపారు. టీడీపీ కాకినాడ రూరల్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, రామదేవు సీతయ్యదొర, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వినోద్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి జల్లి బాలరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చుక్క ధనుంజయ యాదవ్, తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శాంతకుమారి, రంబాల రమేష్‌కుమార్, నాయకులు ప్రభాత్, నందమూరి రాజు, చిక్కం దొరబాబు, పెద్దిరెడ్డి రాము పాల్గొన్నారు.

9న ప్రత్తిపాడుకు చంద్రబాబు

ప్రత్తిపాడు, మార్చి 1: తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మార్చి 9వ తేదీన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు రానున్నారు. ప్రజాగళం పేరుతో నిర్వహించే భారీ బహిరంగ సభ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పర్యటన ఖరారు అయినట్లు నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల సత్యప్రభ శుక్రవారం తెలిపారు. సమావేశానికి సత్యప్రభ స్థల పరిశీలన చేశారు. నరేంద్ర గిరి కొండ పరిసర ప్రాంతాలను, రాచపల్లి గ్రామ పొలిమేరలో స్థలాలను పరిశీలించారు. రెండు మూడు చోట్ల స్థలాలను చూసినా వాటిని ఇంకా ఆమోదించలేదని. శనివారం స్థల పరిశీలన ఒక కొలిక్కి వచ్చి ఖరారు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.సూర్యనారాయణరాజు, బి.గోపిరాజు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్ స్కీం' పనులపై వడివడిగా అడుగులు

అన్నవరం, మార్చి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడంతో దీనికి సంబంధించిన పనులు వడివడిగా జరుగుతున్నాయి. అన్నవరం దేవస్థానంలో ఈ పనులను ప్రధాని మోదీ ఈనెల 7న వర్చువల్‌గా ప్రారంభిస్తారనే సమాచారంతో శుక్రవారం టూరిజం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజారావు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేసి కొలతలు తీసుకున్నారు. రూ 20 కోట్లతో ప్రధానంగా అన్నదాన భవనం, అన్నప్రసాదం స్వీకరించే భక్తుల కోసం క్యూకాంప్లెక్స్ నిర్మించి ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని ఆలోచన చేస్తున్నారు. ప్రధాని మోదీ వర్చువల్ ప్రారంభం అనంతరం కేంద్ర కమిటీ అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసి నిర్మాణ స్థలాలను ప్రత్యక్షంగా పరిశీలించి టెండర్లు పిలవనున్నారు. ఈ పనులను దేవస్థానానికి సంబంధం లేకుండా టెండర్ ప్రక్రియ, నిర్మాణం అంతా టూరిజం పర్యవేక్షణలోనే జరగనున్నాయి. ఈ సందర్భంగా టూరిజం అధికారులు దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్, చైర్మన్ రోహిత్‌లతో సమావేశమయ్యారు. దేవస్థానం ఈఈ మురళీ, డిప్యూటీ ఇంజనీర్ బి.ఎస్ రాంబాబు తదితరులున్నారు.

రత్నగిరిపై అల్లరి నరేష్ పూజలు



వేదాశీర్వచనం అందుకుంటున్న అల్లరి నరేష్

అన్నవరం, మార్చి 1: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం సినీ నటుడు అల్లరి నరేష్ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఏపీఆర్వో గణపతి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు భక్తులు ఆసక్తి కనబర్చారు.

తలుపులమ్మను దర్శించుకున్న అల్లరి నరేష్

తుని రూరల్, మార్చి 1: తలుపులమ్మ లోవలో అమ్మవారిని శుక్రవారం సినీ నటుడు అల్లరి నరేష్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హత్యాయత్నం కేసులో అరెస్టు

అమలాపురం టౌన్, మార్చి 1: గత నెల 28వ తేదీన ఈదరపల్లిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన ఎంపీటీసీ అడపా సతీష్ అలియాస్ సత్తిబాబును అరెస్టు చేసినట్టు అమలాపురం పట్టణ సీఐ కె.కిస్టఫర్ తెలిపారు. సత్తిబాబు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో అతని ఇంటి ఎదురుగా అద్దెకు ఉంటున్న కొత్తపల్లి సుబ్రహ్మణ్యం(48) పై పదునైన కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన సుబ్రహ్మణ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సత్తిబాబును అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండు విధించారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

షాపు దగ్ధం: రూ.20 లక్షల నష్టం



రాజోలు, మార్చి 1: బీఆర్ అంబే డ్కర్ కోనసీమ జిల్లా రాజోలులో శ్రీఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఉన్న కనకం ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్ షాపులో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. అగ్నిప్రమాదం జరిగి రూ.20 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని రాజోలు అగ్నిమాపక అధికారి బాలకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. షాపు యజమాని గ్రంధి నాగవెంకటసుబ్బారావు మధ్యాహ్నం సమయంలో భోజనానికి ఇంటికి వెళ్లగా షాపులో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే రాజోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. రాజోలు అగ్నిమాపక వాహనానికి డ్రైవరు లేకపోవడంతో పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం నుంచి నగరం ఓఎన్జీసీ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పాలకొల్లు, నగరం నుంచి అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. రాజోలు అగ్నిమాపక కేంద్రం నుంచి సరైన సమయంలో అగ్నిమాపక వాహనం వచ్చి ఉంటే ఆస్తి నష్టం తగ్గేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అగ్నిమాపక కేంద్రానికి డ్రైవరు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. సంఘటనా స్థలానికి జిల్లా అధికారి ఎస్.పార్థసారథి, రాజోలు ఎస్ఐ జి.పృథ్వీ వచ్చి పరిశీలించారు.

జీఎస్టీ ఎగవేతపై తనిఖీలు



ఎస్పీ సుబ్బారెడ్డి తనిఖీలు

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లించకుండా ఎగవేసినా, హోటళ్లు తదితర వ్యాపారులు వాణిజ్య అవసరాలకు గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వాడినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని రాజ్‌గురు స్పేర్స్‌లో తనిఖీలు చేశామన్నారు. నాలుగు ప్రదేశాల్లో రూ.1,52,41,352 విలువ చేసే 10,805 వస్తువులకు సంబంధించి స్టాక్ వెరిఫికేషన్ చేశామన్నారు. స్టాక్, కొనుగోలు, విక్రయ రిజిస్టర్లు నిర్వహించకపోవడం గుర్తించామని చెప్పారు. కొన్ని వస్తువులకు సంబంధించి వినియోగదారులు, తయారీదారుల వివరాలు, తప్పనిసరి డిక్లరేషన్ లేకపోవడంతో 5 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే నిడదవోలు మండలంలోని గోపవరంలో టీ-కేఫ్ హోటల్‌లో తనిఖీలు చేయగా వాణిజ్య అవసరాలకు వాడుతున్న 5 గృహ వినియోగ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలనాయుడు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఏవో భార్గవ మహేశ్, లక్ష్మీనారాయణ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ ట్యాక్స్, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రావులపాలెంలో భవిష్యత్‌కు గ్యారంటీ..

రావులపాలెం, మార్చి 1: రావులపాలెంలోని సీఆర్సీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు ఇంటింటికీ పర్యటించారు. సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జరిగే అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించింది టీడీపీ

కొత్తపేట, మార్చి 1: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు భరోసా కల్పించింది టీడీపీయేనని ఆ పార్టీ కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. స్థానిక బండారు బుల్లిసత్యం-చంద్రావతి కాపు కల్యాణ మండపం ఆవరణలో శుక్రవారం మండల మహిళా విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ మహాశక్తి పథకాలతో మహిళలు మరింత అభివృద్ధి చెందేలా అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ-జనసేన ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళా నేతలు సత్తిరాజు ఉషారాణి, బూసి జయలక్ష్మి, దుగ్గిరాల సుబ్బలక్ష్మి, సాదే లక్ష్మి, ముద్రగడ నాగసత్యవేణి, యల్లమల్లి చంద్రకుమారి, ఉప్పలపు పావని, బళ్ల సుధారాణి, రాయుడు రాజేశ్వరి, బూసి మరియమ్మ, బయ్యే ఆదిలక్ష్మి, పప్పుల గంగాభవాని, సరెళ్ళ సరిత, మోర్త విజయలక్ష్మి, తోట కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.




కొత్తపేట: మాట్లాడుతున్న బండారు సత్యానందరావు, మండపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మహిళలు మరింత పురోగతి

ఆత్రేయపురం, మార్చి 1: టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన మహాశక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా పురోగతి చెందుతారని టీడీపీ కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం వాడపల్లిలోని మహాలక్ష్మిరాజు కల్యాణ మండపంలో మండల స్థాయిలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బండారు మాట్లాడుతూ మహిళలంతా ప్రతి ఇంటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించాలనికోరారు. రాబోయేది ఉమ్మడి ప్రభుత్వమేనన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండారు వెంకటసత్తిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి ముళ్ళపూడి భాస్కరరావు, మహిళా నేతలు సత్తిరాజు ఉషారాణి, దుగ్గిరాల సుబ్బలక్ష్మి, ఉద్దరాజు విజయలక్ష్మి, గెడ్డం సుధ, పల్లేటి ధనలక్ష్మి, దొడ్డవనేని దేవి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రభుత్వంలోనే అభివృద్ధి

మండపేట, మార్చి 1: టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక 2,3వార్డుల్లో శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న సీఎం జగన్‌కు ఒణుకు పుట్టిందన్నారు.వార్డుల్లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, టీఎన్‌టీ యూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, కౌన్సిలర్ యరమాటి గంగరాజు, రెండో వార్డు ఇన్‌చార్జి కేతా వెంకటరమణ, మల్లిపూడి గణేశ్వర రావు, వల్లిజానీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదపళ్లలో బాబు ష్యూరిటీ..

అలమూరు, మార్చి1: పెదపళ్లలో టీడీపీ నియోజకవర్గ యువనేత బండారు సంజీవ్ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టే పథకాలకు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల, గ్రామనాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

అసెంబ్లీ టికెట్‌ను వెంటనే ప్రకటించాలి

అమలాపురం టౌన్, మార్చి 1: టీడీపీ ప్రకటించిన తొలి జాబితాలో టిక్కెట్ లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగించడంతో పాటు నిరుత్సాహానికి గురైనట్టు టీడీపీ నేతలు పేర్కొన్నారు. అమలాపురం అసెంబ్లీ సీటును వెంటనే ప్రకటించాలని అధిష్ఠానానికి ఆయన విజ్ఞప్తి చేశారు. మెట్ల రమణబాబు స్వగృహం వద్ద శుక్రవారం పార్టీ విస్తృతస్థాయి శంఖారావం సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన జరిగింది. ఆనందరావు మాట్లాడుతూటికెట్‌విషయంలో పార్టీ నేతలంతా చంద్రబాబు ఆదేశాలకు కట్టుబడి ఉండాలని కోరారు. ఎవరూ నిరుత్సాహ పడవద్దని చంద్రబాబు తప్పక న్యాయంచేస్తారని రమణబాబు పేర్కొన్నారు. పార్టీ విషయాలపై సమావేశంలో చర్చించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, మండల శాఖల అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబురాజు, మల్లుల పోలయ్య, అరిగెల నానాజీ, మాజీ జడ్పీటీసీ చింతా శంకర మూర్తి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, బత్తుల ప్రసాద్, రాజులపూడి భీముడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ట్రేడర్స్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడిగా మాజేటి



యానాం, మార్చి 1: పుదుచ్చేరిలోని చిన్న వ్యాపారుల సంక్షేమం కోసం వ్యాపారుల సంక్షేమ బోర్డును పుదుచ్చేరి ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసింది. గవర్నర్ ఆదేశాలతో పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాం ప్రాంతాలకు చెందిన ఏడుగురు సభ్యులను నాన్ అఫిషియల్ సభ్యులుగా నియమిస్తూ వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ సెక్రటరీ మహ్మద్ మాన్సుర్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ట్రేడర్స్ వెల్ఫేర్ బోర్డు సభ్యుడిగా యానానికి చెందిన మాజేటి సత్యభాస్కర్‌ను ప్రభుత్వం నియమించింది. వర్తకుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ముమ్మిడివరం, మార్చి 1: ముమ్మిడివరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృత పరీక్షలు మొదటిరోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 786మంది విద్యార్థులకు 58మంది గైర్హాజరు కాగా 728మంది పరీక్షకు హాజరైనట్టు కస్టోడియన్ డి.విజయ్‌కుమార్ తెలిపారు. డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ కళాశాలలో 320మందికి 294మంది, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 262మందికి 246మంది, తారా డిగ్రీ కళాశాలలో 204మందికి 188మంది పరీక్షకు హాజరయ్యారు.

మండపేట: మండపేటలో ఆరుకేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజి, ఆదిత్య, విజ్ఞాన్, విద్యావికాస్, ఎంపీఎస్, వైష్టవి కళాశాలల్లో విద్యార్థులు సీసీ కెమెరాల నడుమ పరీక్షలు రాశారు. ఇంటర్ 1912మంది, వొకేషనల్ 447మంది మొత్తం 2,223మందికి 136మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అంబాజీపేట: అంబాజీపేట ఎస్ఎన్ఎం కళాశాల,పుల్లేటికుర్రు ఏపీఎస్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగాజరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

మామిడికుదురు: ఇంటర్ పరీక్షలు మామిడికుదురులో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 470మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షకు హాజరయ్యారు. మండల పరిధిలో నాలుగు కళాశాలలకు చెందిన 497మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ ఎం.మేరికమ్మ సందర్శించి అక్కడ విద్యార్థులకు ఏర్పాటుచేసిన సదుపాయాలను పరిశీలించారు.

రాజోలు: రాజోలులోఇంటర్‌ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రాజోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 470మంది విద్యార్థులకు 440మంది హాజరవ్వగా 30మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎం.అంబేడ్కర్ తెలిపారు.

రాయవరం: రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రాయవరం కళాశాల, స్థానిక విజ్ఞాన్ కళాశాలకు చెందిన 209 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా తెలుగు పరీక్షకు 11 మంది, సంస్కృతం పరీక్షకు ఇద్దరు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్, సీఎస్ డీవీవీ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 508 మంది విద్యార్థులకు 441మంది, నాన్నరాజు కళాశాలలో 377 మందికి 361మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని అధికారులు తెలిపారు.

ఆలమూరు: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు360 మందికి ఎనిమిది మంది విద్యార్థులు హాజరుకాలేదని పరీక్షల నిర్వాహకులు ఆర్.మల్లికాదేవి, వి.సత్యనారాయణ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ పరిశీలించారు.

రామచంద్రపురం: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు పరీక్షలకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 422మందికి 390మంది, మోడరన్ జూనియర్ కళాశాలలో 316మందికి 305మంది, వికాస్ జూనియర్ కళాశాలలో 317మందికి 303మంది, నారాయణ జూనియర్ కళాశాలలో 177మందికి 173మంది, వీఎస్ఎం జూనియర్ కళాశాలలో 402మందికి 392మంది, పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 68మందికి 63మంది హాజరయ్యారని రామచంద్రపురం కస్టోడియన్లు ప్రకాశరావు, ఆదిరెడ్డి తెలిపారు. సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు జూనియర్ కళాశాలల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కొత్తపేట, మార్చి1: ఏనుగులమహల్‌లో 200మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వాసంశెట్టివారిపాలెం నుంచి20కుటుంబాలు, ఏనుగుల మహల్ నుంచి 14 కుటుంబాలు, 35దళిత కుటుంబాలు టీడీపీలో చేరాయి.

స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలించిన ఆర్డీవో

రామచంద్రపురం, మార్చి 1: స్థానిక వీఎస్ఎం కళాశాల బి బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్, సౌకర్యాలను ఆర్డీవో ఎస్.సుధాసాగర్ శుక్రవారం అన్ని పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలించిన రాజకీయ పార్టీల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ, బహుజనసమాజ్ పార్టీ, బీజేపీ, టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీల ప్రతినిధులు, సీఐ పి.దొరరాజు పాల్గొన్నారు.

7న రావులపాడులో మాదిగల రాజకీయ చైతన్యసభ



చైతన్యసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంజయ్ మాదిగ తదితరులు

మండపేట, మార్చి 1: రావులపాలెం మండలం రావులపాడులో ఈనెల7న మాదిగల రాజకీయ చైతన్యసభ నిర్వహిస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ తెలిపారు. శుక్రవారం స్థానిక బాహూజిస్కూల్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నా పాలకులు, రాజకీయ పార్టీలు తమను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయే తప్ప వర్గీకరణ గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మాదిగల సమస్యలు వినిపించాలంటే సభల్లో మాదిగలకు ప్రాధాన్యం ఉండాలన్నారు. మాదిగలతో పాటు ఉప కులాలకు చట్టసభల్లో ప్రవేశానికి రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ సీట్లు కేటాయించి సహకరించిననాడే సాధ్యమవుతుందన్నారు. మాదిగలకు రిజర్వర్డ్ స్థానాల్లో సీట్లు కేటాయించాలని ఆయన రాజకీయ పార్టీలను కోరారు. రాజకీయ చైతన్య సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు సమావేశంలో ముమ్మిడివరపు సుబ్బు, ఎం.త్రిమూర్తులు, ఇజ్రాయిల్, క్రైపు, కె.సామ్యూల్, గంగాదర్, మడికి ప్రవిణ్, ములపర్తి వరప్రసాద్, బుంగలాజర్ మడికి ప్రవీణ్ పాల్గొన్నారు.

సాంకేతికతతో అధిక దిగుబడులు

ముమ్మిడివరం, మార్చి 1: వ్యవసాయ సాగులో రైతులు శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని విస్తరణ విభాగ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ముకుందరావు పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో ఏరువాక కేంద్రంలో గురువారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ(ఆర్ఏఆర్ఎస్ మార్టేరు) సహాయ సంచాలకులు డి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమన్వయ స్థాయి సమావేశంలో ముకుందరావు మాట్లాడారు. కోఆర్డినేటర్ డాక్టర్ బి.భవానీ మాట్లాడుతూ సార్వా దాళ్వా సాగులో చేపడుతున్న వివేదికను వివరించారు. ఈసందర్భంగా డాక్టర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ వరి సాగులో విత్తనం వెదజల్లే విధానాన్ని చేపడితే రైతులు అధిక దిగుబడులు సాధించడంతో సేద్యపు వ్యయానిన ఆదా చేసుకోవచ్చన్నారు. జిల్లా వ్యవసాయాధికారి బి.బోసుబాబు మాట్లాడుతూ ఖరీఫ్ కాలానికి అనువైన స్వల్పకాలిక వరి రకాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పీబీ ప్రదీప్‌కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.నాగేశ్వరరావు, ఎంపీఓ షంషీ, రాజశేఖర్, రామమోహన్, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి హత్య కేసులో దర్యాప్తు జరిపించాలి

అమలాపురం టౌన్, మార్చి 1: ఉత్తరప్రదేశ్‌లో పదో తరగతి పరీక్ష రాసి ఇంటికి వెళ్తున్న దళిత విద్యార్థి సుమేష్‌ను పోలీసులు కాల్చి చంపిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. యూపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలని నినాదాలు చేశారు. ఎస్సీ విభాగం జిల్లా చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శివన్నారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, నాయకులు కుడుపూడి శ్రీను, దేనిపాటి విజయలక్ష్మి, రాయుడు గంగాభవానీ, రాయుడు వెంకటరమణ, కాశి అచ్యుతరామయ్య, మెండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం

అంతర్వేది, మార్చి 1: అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా అష్టోత్తర శత కలశాభిషేకం శుక్రవారం నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108కలశాల్లో 108 స్వామివారి అష్టోత్తర నామాలతో ఆవాహనచేసి కలశాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన కలశను శిరస్సుపై ధరించి అర్చకులు ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారికి జరిగే స్వాతి నక్షత్ర పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

చంద్రబాబు, లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

రాజోలు, మార్చి 1: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లపై మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ అన్నారు. ములికిపల్లిలో మాజీ సర్పంచ్ అనుచూరి పురుషోత్తం స్వగృహం వద్ద రాజోలు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం మాజీ ఎంపీపీ అనుచూరి సునీత అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్నికలపై పూర్తిగా దృష్టి పెట్టాలని కోరారు. మరో ముఖ్యఅతిథి, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లపై గొల్లపల్లి సూర్యారావు వ్యాఖ్యలు చేయడం భావ్యం కాదన్నారు. రాజోలులో అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశానికి టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బోనం నాగేశ్వరరావు, బత్తుల రాము, జగడం సత్యనారాయణ, నల్లి మోహన్, గేదెల వరలక్ష్మి, పిల్లి శ్రీరామమూర్తి, కోళ్ల వెంకన్న, గెడ్డం సింహ, మోకా ప్రసాద్, పార్వతి, జగడం సత్యనారాయణ, సర్పంచ్‌లు చెల్లుబోయిన హెలీన, కోటిపల్లి రత్నమాల, మాజీ సర్పంచ్‌లు చింతా లక్ష్మి, కాండ్రేగుల స్వామి, ముగ్గు పెద్దిరాజు, మెండా వెంకటేశ్వరరావు, కడలి కపిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపతిరాజు ఈశ్వరరాజువర్మ

గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి భారీ ఊరేగింపు



ఆలమూరు, మార్చి1: చింతలూరు వేంకటేశ్వర స్వామి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అష్టదళ పాదపద్మారాధన, జల క్రీడోత్సవం, అష్టలక్ష్మి యాగంలను వైఖానసాగమ పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తుల కోలాహలం నడుమ స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. మహిళలు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. బ్రహ్మోత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లుచేశారు. అన్నసమారాధన జరిపారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు భారీ విరాళాలు అందించిన దాతలు వంటిపల్లి పాపారావు, వంక అన్నవరం, వట్టికూటి సతీష్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిని బ్రహ్మోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.

స్థానికునికి పి.గన్నవరం సీటు కేటాయించాలి

మామిడికుదురు, మార్చి1: టీడీపీ పి.గన్నవరం నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని స్థానిక నాయకునికే కేటాయించాలని, రాజేష్ అభ్యర్థిత్వంపై పునఃపరిశీలించాలని టీడీపీ ఎస్సీ నాయకుల సమావేశం డిమాండు చేసింది. పి.గన్నవరం నియోజకవర్గ ఎస్సీ నాయకుల సమావేశం నగరం గ్రామంలో సీనియర్ నాయకుడు జాలెం సుబ్బారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. పలువురు మాట్లాడుతూ కులమతాల మధ్య చిచ్చుపెట్టే వ్యక్తిగా వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న రాజేష్‌ను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచి నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, ఆయన పోటీచేస్తే వైసీపీ అభ్యర్థికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాజేష్ గోబ్యాక్ అంటూ నినాదాలిచ్చారు. సర్పంచ్ జాలెం రమణకుమారి, మాజీ సర్పంచ్ గోగి రమేష్, నక్కా సత్యనారాయణ, ఉండ్రాజవరపు ప్రభుదాస్, పెదపూడి రాము, జాలెం వెంకటేశ్వరరావు, కొల్లా బత్తుల బాబూరావు, జాలెం రాజేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ విశ్వకర్మయోజన వర్తింప చేయాలి

అమలాపురం టౌన్, మార్చి 1: అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మయోజన పథకం అందేలా చూడాలని జిల్లా చేతివృత్తుల, దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. విశ్వకర్మయోజన పథకంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేయాలని కోరారు. అనంతరం సంఘం తరఫున కమిషనర్‌ను సత్కరించారు. సంఘ ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, కుసుమే నరసింహరాజు, ముస్కూరి ఏసురాజు, యార్లగడ్డ సుందరరావు, వాసంశెట్టి గణేష్‌స్వామి, పాటి వెంకటరమణ, కుడుపూడి గోపి, పోతాబత్తుల శ్రీను, వక్కలంక బేబీరావు, ఎ.సూరిబాబు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వమే సైన్స్ ఆవిర్భావానికి కారణం

అమలాపురం రూరల్, మార్చి 1: ప్రశ్నించే తత్వమే సైన్స్ ఆవిర్భావానికి మూల కారణమని విద్యార్థి విజ్ఞాన్‌మంథన్ స్టేట్ కోఆర్డినేటర్ వీవీఎల్ఎన్ శ్రీరామ్, సీనియర్ ఫిజిక్స్‌ఫ్యాకల్టీ ఏవీ రామకృష్ణ పేర్కొన్నారు. సైన్స్‌ను ఎంత అర్థం చేసుకున్నా ఇంకా తెలియాల్సింది, తెలుసుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. కామనగరువు ఆదిత్య ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపల్ రాంప్రసాద్ అధ్యక్షతన అకడమిక్ ఫైర్ అవిన్య 2024-ది కల్చరల్ ఎక్స్‌పో ముగింపు సభ శుక్రవారం నిర్వహించారు. సైన్స్ దినోత్సవ విశిష్టతను విద్యార్థులకు వక్తలు వివరించారు. విద్యార్థులు 224 ప్రాజెక్టులను ప్రదర్శించగా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సైన్స్ ప్రదర్శనను విజయవంతం చేసిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ వీవీ చలపతిరావు అభినందించారు.

ఆక్వా వ్యర్థాలను పంటకాల్వలో వదులుతున్న వారికి జరిమానా

అమలాపురం టౌన్, మార్చి 1: అమలాపురం ఎర్రవంతెన దిగువన ఉన్న పీజీఎం సీఫుడ్స్ నిర్వాహకులు రహదారిని తొలగించి నేరుగా గొట్టాలను ఏర్పాటు చేసుకుని ఆక్వా వ్యర్థాలను ప్రధాన పంట కాల్వలోకి వదులుతున్నారన్న సమాచారంతో ఇన్‌చార్జి శానిటరీ ఇనస్పెక్టర్ చింతా నాగేంద్రప్రసాద్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి బండి వీరన్నలు శుక్రవారం తనిఖీ నిర్వహించారు. పంట కాల్వ నీటిని కలుషితం చేస్తున్నట్టు గుర్తించి సీఫుడ్స్ యజమాని పాలెపు నరసింహస్వామికి రూ.5వేలు జరిమానా విధించి వసూలు చేశారు. పంటకాల్వలో అమర్చిన గొట్టాలను ధ్వంసం చేశారు. ఈతరహాలో ఎవరైనా పంట కాల్వలోకి వ్యర్థాలను విడిచిపెడితే భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: చార్లీ 111
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: భూతద్దం భాస్కర నారాయణ
శేఖర్ స్క్రీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	: హనుమాన్
రమా	: గుంటూరు కారం
గణపతి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఆపరేషన్ వాలంటైన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: డూన్

సిమెంటు రోడ్లకు నిధులు మంజూరు

మామిడికుదురు, మార్చి1: మండలంలోని పలు గ్రామాల్లో సిమెంటురోడ్లకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీపథకం ద్వారా రూ.31లక్షలు మంజూరైనట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. మాకనపాలెంలో రూ.4లక్షలు, మొగలికుదురులో రూ.4లక్షలు, పెదపట్నంలంకలో రూ.3లక్షలు, అప్పనపల్లి ఉచ్చుల వారిపేటలో రూ.4లక్షలు, పాశర్లపూడి చింతలమెరక సీసీ రోడ్డుకు రూ.17లక్షలు మంజూరయ్యాయన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపడతామన్నారు.

5న చిట్టబ్బాయి కాంస్య విగ్రహావిష్కరణ

అల్లవరం, మార్చి 1: అమలాపురంలో ఈనెల5న జరిగే మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి కాంస్య విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైసీపీ నాయకులు కోరారు. దీనికి సంబంధించిన కరపత్రాలను అల్లవరం మొల్లేటిగరువు రామాలయం వద్ద శుక్ర వారం ఆవిష్కరించారు. రుద్రరాజు నానిరాజు, చిట్టూరి పెదబాబు, బొక్కా నాగశివప్రసాద్, మొల్లేటి నాగదేవరాయులు, మెరికల శ్రీనివాసరావు, భైరిశెట్టి రామారావు, పులుసుగంటి గంగాధర్, పితాని రాంబాబు, కొల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ద్రాక్షారామ, మార్చి 1: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం రాత్రి అడపావారిసావరానికి చెందిన అడపా సత్యనారాయణ(50) రామచంద్రపురం వైపు నుంచి మోటారు సైకిల్‌పై గ్రామంవస్తున్నాడు. పెద్దతాళ్లపొలం కంచిపేట వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. అతడు అక్కడికక్కడ మృతి చెందాడు. ఎస్ఐ సురేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5లక్షల సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

అమలాపురం రూరల్, మార్చి 1: నారాయణపేటకు చెందిన కళ్లపల్లి కృపారాజశేఖర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.5లక్షలు రాజశేఖర్ కుటుంబ సభ్యులకు భట్నవిల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి పినిపే విశ్వరూప్ అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

యానాం, మార్చి1: కురసాంపేటకు చెందిన అరదాడి నూకరాజు, మేడా రాంబాబులు సావిత్రినగర్ వైపు మార్కెట్‌కు బైక్‌పై వెళ్తున్నారు.దరియాలతిప్ప నుంచి వస్తున్న ఆదేగ్రామనికి చెందిన రేవు మల్లీశ్వరరావు బైక్‌పై వెళ్తుండగా దొమ్మేటిపేట యానాం స్టీల్స్ ఫ్యాక్టరీ వద్ద రెండు బైక్స్ ఢీకొన్నాయి. అరదాడి నూకరాజు(45) అక్కడికక్కడే మృతిచెందాడు.గాయపడ్డ మేడా రాంబాబు, రేవు మల్లీశ్వరరావులను కాకినాడ తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి వేణుకు బార్ అసోసియేషన్ కృతజ్ఞతలు

రామచంద్రపురం, మార్చి 1: రామచంద్రపురంలో అడిషనల్ జిల్లా కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సీఎం జగన్ ఫైల్‌పై సంతకంచేశారని రామచంద్రపురం బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఇచ్చిన మేరకు జిల్లా కోర్టు ఏర్పాటు అయిందన్నారు. శుక్రవారం రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మంత్రి వేణును ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పలివెల సత్యన్నారాయణ, డి.ఎస్.ఎస్.శర్మ, సహాయ కార్యదర్శి ఎన్.వి.రెడ్డి, కోశాధికారి జె.ఎస్.ఎస్.చక్రవర్తి న్యాయవాదులు వాకలపూడి జయశంకర్, సాలగ్రామ శ్రీనివాస్, చోడి జాన్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు

ముమ్మిడివరం, మార్చి1: సీహెచ్ గున్నేపల్లిలో సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గతనెల 24న ప్రారంభమైన జాతరమహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కార్తికేయ ఈవెంట్స్ సింగులూరి మణికంఠ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి పలువుర్ని విశేషంగా ఆకట్టుకుంది. గాయనీ, గాయకులు సాయిచరణ్, శ్రీనివాస్, హరిణి, మనీష, యాంకర్లు రమ్య, దీప్తిలు ప్రేక్షకులను తమ పాటలతో అలరించారు. కోనసీమ జిల్లా నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలపై అవగాహన

అంబాజీపేట, మార్చి 1: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవీఎంల పనితీరు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మామిడికుదురు, అయినవిల్లి తహసీల్దార్లు ప్రమద్వర, ఎం.మేరికమ్మ ఎన్నికల విధుల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులకు రీసోర్స్‌పర్సన్లగా సాయిరామ్, లక్ష్మినారాయణలు వ్యవహరించి ఈవీఎంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, డిప్యూటీ తహసీల్దారు పి.నాగపద్మలక్ష్మి, ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

అరబిందో సొసైటీ నుంచి పుల్లయ్య మాస్టారుకు పురస్కారం

కె.గంగవరం, మార్చి1: అరబిందో సొసైటీ గతసంవత్సరం కొన్ని పాఠశాలల్లో 3,4,5తరగతుల విద్యార్థులకు తర్ఫీదుఇచ్చి పరీక్షలు నిర్వహించింది. ఆ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చిన పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు. పాణింగపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మేడిశెట్టి పుల్లయ్య మాస్టారు అరబిందో సొసైటీ నుంచి పురస్కారం అందుకున్నారు. అలాగే ఎంఈవో1 నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు ఆధ్వర్యంలో కె.ఆర్.కె.ప్రసాద్, జి.శ్రీనివాసు, కె.ఎస్.వి.వి.వర్మలు పురస్కారాలు అందుకున్నారు.

స్ట్రాంగ్‌మెన్ 2024గా లవకుమార్

ముమ్మిడివరం, మార్చి 1: కాకినాడ పీఆర్ కళాశాలలో ఇటీవల జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీలో ముమ్మిడివరం హెల్దీలైఫ్ జిమ్ విద్యార్థి వాసంశెట్టి లవకుమార్ స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ది 2024 టైటిల్ సాధించి ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించాడు. ఈసందర్భంగా స్థానిక జిమ్‌లో శుక్రవారం జరిగిన అభినందన సభకు ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య అధ్యక్షత వహించి మాట్లాడారు. తల్లి వెంకటలక్ష్మి కూలి పని చేసుకుంటూ కొడుకును స్ట్రాంగ్ మెన్‌గా నిలపడం గర్వకారణమన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో సర్జన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ లవకుమార్, అతని తల్లి వెంకలక్ష్మికి ఉచితంగా వైద్యసేవలందిస్తామన్నారు. లవకుమార్, తల్లి వెంకటలక్ష్మిని అభినందించి సన్మానించారు. అలాగే గోల్డ్‌మెడల్ సాధించిన దొమ్మేటి వేణుమణికంఠ, సంసాని సత్యనారాయణ, బ్రాంజ్ మెడల్ సాధించిన పొత్తూరి కుమార్‌రాజు, జేఎన్‌టీయూసీ సిల్వర్ మెడల్ సాధించిన కాశి ప్రదీప్, శివలను పతకాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిమ్ కోచ్ వాసంశెట్టి నరేష్, మంజీరా ఆసుపత్రి ఎండీ ప్రేమ్, సంసాని నాగరాజు, పటిల్ కోచ్ మధు, జాఫర్, బాలు, వీరేష్ పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కె.గంగవరం, మార్చి 1: సత్యవాడలో శ్రీపార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయ పునః శివలింగ ధ్వజ చండేశ్వరస్వామివార్ల ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం యాగశాలప్రదిక్షణం, భూతబలి, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, ఋుత్విక్‌వరుణులు, దీక్షాధారణ, అఖండ దీపారాధన, త్రిశూల పూజ, ప్రధాన కలశారాధన నిర్వహించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

రాజోలు, మార్చి 1: చింతలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పైడిపర్తి సాయిబాబు (59) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. గుండెపోటుతో ఆయన హైస్కూల్‌లో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో వెంటనే తోటి ఉపాధ్యాయుడు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. ఆయన మృతి పట్ల ఎంఈవో ఎ న్.మనోహరం, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీనివాసులు

ముమ్మిడివరం, మార్చి 1: ముమ్మిడివరం డిప్యూటీ తహసీల్దార్‌గా జి.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన యడ్ల రాంబాబు ఎన్నికల బదిలీల్లో పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి

అంబాజీపేట, మార్చి 1: వైసీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. కె.పెదపూడి, పుల్లేటికుర్రు గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వ ర్యంలో పలువురు వైసీపీలో చేరారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, నీతిపూడి వెంకటరమణ, ఉందుర్తి ఆనందబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు, వాసర్ల మరిడి, నేలపూడి స్టాలిన్‌బాబు పాల్గొన్నారు.

ఎంపీ బోస్‌ను కలిసిన గొల్లపల్లి

ద్రాక్షారామ, మార్చి1: వెల్ల పర్యటనలో ఉన్న రాజ్యసభసభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను శుక్రవారం ఇటీవల వైసీపీలో చేరిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలో చేరిన గొల్లపల్లిని బోస్ అభినందించారు. యు.వి.బాస్కర్, నాగిరెడ్డి గోపి, కేసరి మునేశ్వరరావు పాల్గొన్నారు.

30మంది విద్యార్థుల రక్త దానం

పి.గన్నవరం, మార్చి 1: బ్రైట్ స్టోన్స్ ఆధ్వర్యంలో పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ, జూనియర్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. 30మంది విద్యా ర్థులు రక్తదానం చేసినట్టు కళాశాల చైర్మన్ నల్లి శ్రీచరణ్ తెలిపారు. పి.వి.ఆర్.నాయుడు, మనీషా, ఐ.రాకేష్, జి.బాలకుమార్ పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీలను సాగనంపండి

మలికిపురం, మార్చి 1: దేశంలో మతాలు, కులాల మధ్య కుంపటి రాజేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ, వైసీపీ పార్టీలను సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మలికిపురంలో జరిగిన సీపీఐ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులను, క్రైస్తవులను, ముస్లింలను అతికిరాతకంగా చంపుతున్నా ఈప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జగన్ కూడా నిరంకుశంగా పరిపాలన చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈపార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు. నల్లి బుజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, దేవ రాజేంద్రప్రసాద్, పి.రాము, ఎస్.వెంకటేష్, కె.రామకృష్ణ, గెడ్డం ప్రభాకరరావు, చెల్లుబోయిన తాతారావు, దేవ సురేష్‌బాబు, మేడిచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీగా సత్యనారాయణ

అంతర్వేది, మార్చి 1: సఖినేటిపల్లి మండల ఈవోపీఆర్డీగా వీవీ సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మండలంలోని గ్రామకార్యదర్శులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించారు. ఇక్కడ ఈవోపీఆర్డీగా పనిచేసిన కె.సూర్యనారాయణ గణపవరం బదిలీపై వెళ్లారు. అక్కడి నుంచి సత్యనారాయణ ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో ఎస్ఆర్కే రాజు, అడబాల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.